క్లుప్తంగా

కేజీ కృష్ణమూర్తికి మాతృవియోగం



నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : తరిగొండ వెంగమాంబ ప్రాజెక్ట్ మాజీ డైరెక్టర్ కేజీ కృష్ణమూర్తి మాతృమూర్తి శనివారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి వెంటనే వారి నివాసానికి వెళ్లి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు.

సమస్యల పరిష్కారానికి వినతి



టీటీడీ చైర్మన్‌కు వినతి పత్రం అందిస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు శనివారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకి వినతి పత్రం సమర్పించారు. గత 24 ఏళ్లుగా నిత్యం స్వామి వారి దివ్య వైభవాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 320 మంది ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతలు వై. హేమప్రకాష్, కె.దేవానంద ,జి.నారాయణ, జె.ఉదయభాస్కర్, ఎం.హేమకుమార్, ఎం.మోహన్ పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో బయోసైన్స్ ఇన్నోవేషన్

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలో డీబీటీ బిల్డర్ బయోసైన్స్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను శనివారం నిర్వహించారు. స్టార్టప్‌లో సాంకేతికతను ఉపయోగించుకునే విధానం, నూతన ఆవిష్కరణ కోసం వనరుల సేకరణ, ఆవిష్కరణల ప్రచురణ వంటి విషయాలపై అతిథులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజిని, చెన్నై ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ దినకర్‌రావు, ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త కదిరి మోహన్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పి.ఉమ మహేశ్వరి దేవి, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ శ్రీదేవి, ప్రొఫెసర్ ఆర్.ఉష పాల్గొన్నారు.

వివిధ మార్కెట్లకు వేలం



వేలం ప్రక్రియలో కమిషనర్ తదితరులు

తిరుపతి తుడా : కార్పొరేషన్ పరిధిలోని వివిధ కూరగాయల మార్కెట్లు, జంతు వధశాల, పార్కింగ్ స్థలాలను శనివారం నిర్వహించిన బహిరంగ వేలం లో పలువురు దక్కించుకున్నట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌ను రూ. 4.76 కోట్లకు మోహన్‌బాబు అనే వ్యక్తి దక్కించుకున్నట్లు వెల్లడించారు. రామచంద్ర గుట్టకట్ట మార్కెట్‌ను రూ .2. 34 లక్షలు, జంతు వధశాల ను రూ.4లక్షలకు పిఎస్ మునిరాజా బాబు కైవసం చేసుకున్నారన్నారు. విష్ణువర్దన్ రూ 33 లక్షలకు పార్కింగ్ స్థలాలను, శ్రీనివాసం ఏరియా భారతి బస్టాండ్ పార్కింగ్ స్థలాలను సురేష్ కుమార్ రూ. 10.40 లక్షలకు, కృష్ణమూర్తి అనే వ్యక్తి జీఎన్, జీఎస్ ప్రాంతాల పార్కింగ్ స్థలాలను రూ. 3,35,599కు దక్కించుకున్నట్లు వివరించారు.


'సిద్ధార్థ'లో పొటెన్జా-2025



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఆనందరెడ్డి

తిరుపతి రూరల్ : మండలంలోని గొల్లపల్లి సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పొటెన్జా-2025 జాతీయ స్థాయి ప్రాజెక్టును విద్యార్థులు ప్రదర్శించారు. ప్రధానంగా ఐఆర్ సెన్సార్ ద్వారా ప్రమాద నివారణ, లాట్ ఆధారిత స్మార్ట్ హోమ్ ఆటోమేషన్, ఫుట్‌స్టెప్ ఎలక్ట్రికల్ జనరేషన్, వైర్‌లెస్ చార్జింగ్ వాహనాలు, ఎనర్జీ ట్రాన్స్‌ఫర్, ఆర్‌పీఎం కౌంటర్లు, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ వంటి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. విద్యా సంస్థల చైర్మన్ కొండారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఆనందరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్, నితిన్ పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో స్పార్క్ ఫెస్ట్



అతిథిని సత్కరిస్తున్న కళాశాల నిర్వాహకులు

తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన స్పార్క్ ఫెస్ట్-2025 శనివారంతో ముగిసింది. చెన్నై జోహో సంస్థ సీనియర్ మేనేజర్ జీవితా సత్యనారాయణన్ విచ్చేసి ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ ,సృజనాత్మకతపై దృష్టి సారించాలన్నారు. కళాశాల చైర్మన్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్ ప్రకాష్, సెక్రటరీ ప్రదీప్ మాట్లాడుతూ విద్యార్థులు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి కళాశాల వార్షిక ప్రగతిని నివేదించారు.

సంబరం



చంద్రగిరి మండలం అగరాలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈ ఏడాది నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో కలిసి, అధ్యాపకులు శనివారం విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ప్రిన్సిపల్ సుకుమార్ మాట్లాడుతూ మొత్తం 77 మంది విద్యార్థులు ఉద్యోగావకాశాలు పొందారన్నారు. అనంతరం విద్యార్థులకు నియామక ఉత్తర్వులను అందజేశారు. రవి కుమార్, నాగరాజు, భక్తవత్సలం, నాగేంద్ర, నరసింహా రెడ్డి పాల్గొన్నారు. - చంద్రగిరి

సింపోజియం



ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం సిగ్మోయిడ్-2025ను రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, డిక్సన్ టెక్నాలజీస్ మాజీ ఉపాధ్యక్షుడు కేపీ రాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షార్ కేంద్రం స్పేస్ ఆన్ వీల్స్‌ను అందుబాటులో ఉంచారు. ప్రదర్శనకు వివిధ పాఠశాలల విద్యార్థులు తరలివచ్చారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి, విభాగాధిపతి స్వర్ణలత, వరదరాజన్ పాల్గొన్నారు. - తిరుపతి సిటీ

సేవా సమయం



వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి తేజస్విని అవగాహన కల్పించారు. శనివారం బొప్పరాజుపల్లెలో 104 ఆరోగ్య సేవలు నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ అత్యవసర పనులుంటే తప్ప బయటకు రాకూడదని సూచించారు. ఒక వేళ వస్తే గొడుగు, టోపీ, తలపాగా వంటివి రక్షణగా ధరించాలని తెలిపారు.అధికంగా పండ్ల రసాలు తీసుకోవాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. - తిరుపతి రూరల్ (రామచంద్రాపురం)

చల్లగాలి వీచె.. తనువు పులకరించె!



ఎయిర్ కండిషన్‌లను కనీస అవసరంగా ప్రజలు భావిస్తున్నారు. ప్రతి పది ఇళ్లలో నాలుగింట ఏసీలను అమర్చుకుంటున్నారు. వేసవి నేపథ్యంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఈ క్రమంలోనే విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు అత్యాధునికమైన ఐదు నక్షత్రాల ఏసీలను కొనుగోలు చేసేందుకు అధికంగా మొగ్గుచూపుతున్నారు. భరించరాని ఉక్కపోత నుంచి విముక్తి కోసం రాత్రింబవళ్లు ఎయిర్‌కండిషన్డ్ గదులనే ఆశ్రయిస్తున్నారు.

- వేసవి నేపథ్యంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఇంటింటా వెలుస్తున్న ఏసీలు
- కనీస అవసరంగా పరిగణిస్తున్న ప్రజలు

తిరుపతి మంగళం : వేసవి ఆరంభంలోనే ఎండలు మండుతున్నాయి. ఈ ఏడాది ఉష్ణోగ్రతల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో భానుడిని ఎదుర్కొనేందుకు నగరవాసులు ముందస్తు ఏర్పాట్లలో ఉన్నారు. తమ బడ్జెట్ మేరకు కూలర్లు, ఏసీలను సమకూర్చుకునే పనిలోపడ్డారు. ఇప్పటికే ఇళ్లలో ఉన్నవాటికి మరమ్మతులు చేయిస్తున్నారు. నగరంలో చేపట్టిన సర్వేలో 84శాతం మంది వేసవిలో ఏసీని మరమ్మతు చేయించుకుంటున్నట్లు తెలిసింది.

తక్కువ కరెంట్‌కే ఓటు

కరెంట్ వినియోగం తక్కువగా ఉండాలని, ఎక్కువ చల్లదనం అందించాలని అనుకునే వారు నగరంలో ఎక్కువే. దీంతో ఫైవ్‌స్టార్ ఇన్వర్టర్ ఏసీలకు డిమాండ్ అధికంగా ఉంది. ఏటా 750 యూనిట్ల విద్యుత్ దాటకూడదని కోరుకుంటున్న వారు అధిక సంఖ్యలోనే ఉన్నారు. దాదాపు 50శాతం మంది కాస్త ఉక్కపోత పోస్తే చాలు ఏసీ ఆన్ చేసేస్తారు. 15శాతం మంది రోజు 4-6 గంటలు వినియోగిస్తున్నామని చెబుతున్నారు.

ఒక్కొక్కరు ఒక్కోలా..!

వేసవి తాపం మొదలైనా కొంత మంది రాత్రిపూట 4-6గంటలు మాత్రమే ఏసీని వినియోగిస్తున్నారు. మరికొందరు ఏసీకి అలవాటు పడి రాత్రి పగలు అనే తేడా లేకుండా వాడుతున్నారు. ఇంకొందరు ఎండలో బయటకు వెళ్లి ఇంటికి రాగానే కనీసం రెండు గంటలైనా ఏసీని వేసుకుని సేదతీరుతున్నారు. ఇలా అవసరాలకు అనుగుణంగా నగరవాసులు ఏసీ వసతిని ఆస్వాదిస్తున్నారు.

కూల్ కూల్‌గా..

ఎయిర్ కూలర్ కంటే ఎయిర్ కండిషన్ వైపే నగరవాసులు అధికంగా మొగ్గు చూపుతున్నారు. ఎండ వేడిమిని తట్టుకునేందుకు కరెంట్ బిల్లులు పెరుగుతున్నా లెక్కచేయడం లేదు. ఈ నేపథ్యంలో దాదాపు 37శాతం మంది వేసవ కాలంలో ప్రతి నెలా రూ. 1,500 నుంచి రూ.3వేల వరకు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. 17శాతం మంది రూ.3వేల నుంచి రూ.5వేల వరకు కడుతున్నారు. 10శాతం మంది ఏకంగా రూ.5వేలకుపైగానే బిల్లు చెల్లిస్తున్నామని చెబుతున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని సామాన్య, మధ్య తరగతి ప్రజలు సైతం అప్పు చేసి మరీ ఏసీలు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రతి ఇంట్లో ఏసీ అనేది కామన్‌గా మారింది. మరికొందరైతే రెండు, మూడు ఏసీలు కూడా వినియోగిస్తుండడం విశేషం.

జగమంతా మెచ్చేలా జాతర



మాట్లాడుతున్న గోపీ యాదవ్

తిరుపతి మంగళం : తాతయ్యగుంట గంగమ్మ జాతరను జగమంతా మెచ్చేలా రెండు సార్లు నిర్వహించిన ఘనత అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికే దక్కుతుందని గంగమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కట్టా గోపీయాదవ్ తెలిపారు. శనివారం పద్మావతిపురంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గంగ జాతర పనుల్లో అవినీతి జరిగిందని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆరోపించడం దారుణమన్నారు. ఇన్నాళ్లకు గంగమ్మ ఆలయం గుర్తు వచ్చిందా అని ప్రశ్నించారు. ఆలయానికి వచ్చి ప్రధాన అర్చకుడు, ఉద్యోగిని బెదిరించడం వారి అరాచకాలకు నిదర్శనమన్నారు. గంగజాతరను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర పండుగగా గుర్తింపు తెచ్చిన ఘనత కూడా కరుణన్నదేనని స్పష్టం చేశారు. టీటీడీ ఇచ్చే రూ. 50లక్షలతో అంతటి వైభవంగా జాతర నిర్వహించడం సాధ్యమవుతుందా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ నిధుల్లో అవినీతి జరిగిందనేందుకు నోరు ఎలా వచ్చిందన్నారు. సమావేశంలో గంగమ్మ ఆలయ కమిటీ మాజీ సభ్యులు పడమటి కుమార్, వెంకటేష్‌రాయల్, సుధాకర్ పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- యూత్ హాస్టల్‌లో ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం.
- లక్ష్మీపురం సర్కిల్‌లోని ఓ హోటల్‌లో ఉదయం 10 గంటలకు కేంద్ర బడ్జెట్, జీఎస్టీ చట్టాలపై వ్యాపారులకు అవగాహన సదస్సు.
- మహతి ఆడిటోరియంలో ఉదయం 11.30 గంటలకు శ్రీవేంకటేశ్వర చిల్డ్రన్స్ హైస్కూల్ వార్షికోత్సవం.
- ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేటీ రోడ్డులోని కమ్మ సంఘం హాల్లో ఉదయం 6 నుంచి ఇన్నర్ ఇంజినీరింగ్ సదస్సు.
- నల్లాని శ్రీరాములు జయంతి సందర్భంగా డీఆర్ మహల్ రోడ్డులోని గాంధీపురం సర్కిల్‌లో మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం.
- బైరాగిపట్టెడలోని చాంబర్ ఆఫ్ కామర్స్‌లో సాయంత్రం 5 గంటలకు ఉగాది కవి సమ్మేళనం.
- రేపటి నుంచి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద విద్యుత్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు
- 27వ తేదీన శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 30న ఉగాది ఆస్థానం
- 25న శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పుష్పయాగం.
- రేపటి నుంచి రామచంద్రాపురం మండలంలో విద్యుత్ సదస్సులు ప్రారంభం.

'శబ్దబోధ మీమాంస'పై వర్క్‌షాపు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో శబ్దబోధమీమాంస అనే అంశంపై వారం రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ వర్క్‌షాప్‌ను శనివారం ప్రారంభించారు. రాజస్థాన్ సంస్కృత వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ కేవీ రామకృష్ణాచారులు మాట్లాడుతూ శాస్త్ర జ్ఞానాన్ని భావితరాలకు అందించడమే వర్సిటీల లక్ష్యం కావాలని సూచించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృత భాషకు తాతాచార్య చేసిన సేవకు గుర్తింపుగా వర్సిటీలో శైక్షిక భవనానికి ఆయన పేరు పెట్టామని వెల్లడించారు. ప్రొఫెసర్ రంగనాథన్, డాక్టర్ ఓజీపీ కల్యాణశాస్త్రి పాల్గొన్నారు.

మాతృభాషపై పట్టు తప్పనిసరి



భాస్కరరాజును సత్కరిస్తున్న అధికారులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రతి విద్యార్థికీ మాతృభాషపై పట్టు తప్పనిసరని, అప్పుడే ఇతర భాషల్లోనూ రాణించవచ్చని పాఠశాల విద్య ఆర్‌జేడీ కె.శామ్యూల్ తెలిపారు. భాస్కరరాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో తిరుపతి సంజయ్‌గాంధీ కాలనీలోని నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో 30రోజులుగా నిర్వహించిన తెలుగు రీడింగ్ చాలెంజ్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఆర్‌జేడీ మాట్లాడుతూ విద్యార్థులు తెలుగులో ధారాళంగా చదవడం, మాట్లాడడం, రాయడంపై భాస్కరరాజు చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం భాస్కరరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఈఓ కేవీఎస్ కుమార్, డీవైఈఓ బాలాజీ, ఎంఈఓ భాస్కర్‌నాయక్, హెచ్‌ఎం ధనంజయులు పాల్గొన్నారు.

తండ్రిపై కోడి దొంగతనం కేసు

- కక్ష పెంచుకున్న కుమారుడు
- ఫిర్యాదుదారుడిపై హత్యాయత్నం
- ముద్దాయి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: మున్సిపల్ కార్పొరేషన్ మేస్త్రి పై హత్యాయత్నానికి పాల్పడిన ముద్దాయిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఈస్ట్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు వరకు.. డీఆర్ మహల్ రోడ్డులో కార్పొరేషన్ మేస్త్రిగా పనిచేస్తున్న తులసీరామ్‌పై అదే ఏరియాకి చెందిన వ్యక్తులు ఈనెల 20వ తేదీన దాడికి పాల్పడ్డారు. ఆయన తీవ్ర గాయాలతో రుయా ఆస్పత్రిలో చేరారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఆసక్తికర విషయాలు బయట పడ్డాయి. డీఆర్ మహల్ వద్ద నివాసముంటున్న గౌరీశంకర్, అతని స్నేహితులు ఉమాప్రసాద్, వెంకీతో కలిసి తులసీరామ్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డారు. గతంలో తులసీరామ్ గౌరీశంకర్ తండ్రి నాగరాజుపై కోడి దొంగతనం విషయమై ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పట్లో నాగరాజును అరెస్ట్ చేయగా అతను స్టేషన్ మిద్దెపై నుంచి దూకి మృతి చెందాడు. దీనిని మనసులో పెట్టుకుని తన తండ్రి చావుకు తులసీరామ్ కారణమని గౌరీశంకర్ కక్ష పెంచుకుని అతన్ని హతమార్చేందుకు ప్రణాళిక రచించాడు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వృద్ధాశ్రమానికి కూలర్ల వితరణ



కూలర్లు అందిస్తున్న కేపీసీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : కేపీసీ ఫౌండర్ కేసీ పుల్లయ్య 13వ వర్ధంతి సందర్భంగా కేపీసీ ప్రాజెక్టు డీజీఎం శ్రీధర్, సీనియర్ ప్రొడక్షన్ మేనేజర్ జగదీష్ శనివారం వృద్ధాశ్రమానికి కూలర్లను వితరణ చేశారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేసీ పుల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.

పాలిటెక్నిక్‌కు వాటర్ ప్యూరిఫైయర్



పూర్వ విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : టీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు శనివారం రూ.65వేల విలువైన వాటర్ ప్యూరిఫైయర్‌ను 2011-14 పూర్వ విద్యార్థులు వితరణగా అందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి, పూర్వ విద్యార్థులు శివశంకర్, యుగంధర్, సాయిశ్రీనివాస్, కీర్తి, గీత, చంద్రశేఖర్, విభాగాధిపతులు డాక్టర్ ఎస్వీ.గౌరీశంకర్, అచ్యుత రామారావు, జి.కృష్ణమూర్తినాయుడు పాల్గొన్నారు.

యంత్రాలతో మెరుగైన పారిశుద్ధ్యం



స్వీపింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరంలో పారిశుద్ధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టేందుకు యంత్రాలను వినియోగిస్తున్నామని కమిషనర్ మౌర్య తెలిపారు. శనివారం తిరుమల రెడ్డి నగర్, గోదాదేవి మార్గం తదితర ప్రాంతాల్లో హెల్త్ , ఇంజినీరింగ్, ప్లానింగ్ అధికారులతో కలసి స్వీపింగ్ యంత్రాలతో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నూతనంగా రెండు స్వీపింగ్ యంత్రాలు కొనుగోలు చేశామన్నారు. ఏజీ అండ్ పీ సంస్థ గ్యాస్‌తో నడిచే మూడు ఆటోలను విరాళంగా అందించిందని వెల్లడించారు. ఈ క్రమంలోనే ప్రతి రోజూ ఇంటింటికీ చెత్త వాహనం వెళ్లేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కాలువల్లో, రోడ్లపైన చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి , హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి సేతుమాధవ్ పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాలలోని భువన విజయం ఆడిటోరియంలో ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టి పెట్టుకుని అధునాతన వైద్య విద్య అందించాలని కోరారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఉత్తమ విద్యను అందించడమే కళాశాల లక్ష్యమని వెల్లడించారు.

ఫార్మాకాలజీపై వర్క్‌షాప్



జ్యోతి ప్రజ్వలనలో ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి తుడా : నిరంతర వైద్య విద్య కార్యక్రమంలో భాగంగా ఎస్వీ వైద్య కళాశాలలో శనివారం ఫార్మాకాలజీ విభాగం ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ ఆశాలత, ప్రొఫెసర్ భారతి, డాక్టర్ సురేంద్రకుమార్, డాక్టర్ అమృత్ కిరణ్ కుమార్, భార్గవి, మీనాక్షి, రాధ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిజాయితీ



ప్రయాణికుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులు తమ నిజాయితీ చాటుకున్నారు. శనివారం తిరుమల నుంచి తిరుపతికి వచ్చే క్రమంలో తిరుపతి బస్టాండ్‌లోని బెంగళూరు సర్వీస్‌లో విశాఖపట్నానికి చెందిన ధనంజయలు నాయుడు అనే భక్తుడు తన సెల్ ఫోన్‌ను వదిలి వెళ్లిపోయాడు. అలిపిరి డిపోకు వెళ్లిన తర్వాత డ్రైవర్ ఎస్‌కెహెచ్ బాషా, కండక్టర్ బీఎస్ మన్యం గుర్తించారు. ప్రయాణికుడికి సమాచారం అందించి అలిపిరి డిపోలో తిరిగి సెల్‌ఫోన్ అప్పగించారు. పలువురు ఉద్యోగులు డ్రైవర్, కండక్టర్‌ను అభినందించారు.

కెమిస్ట్రీ విభాగాధిపతిగా పద్మజ



తిరుపతి సిటీ : ఎస్వీయూ కెమిస్ట్రీ విభాగాధిపతిగా ప్రొఫెసర్ ఎ.పద్మజ నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.

నీటి పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంపీ రమణ

తిరుపతి సిటీ : నీటి వనరుల పరిరక్షణ అందరి బాధ్యతని ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంపీ రమణ తెలిపారు. శనివారం కళాశాలలో అంతర్జాతీయ నీటి దినోత్సవం నిర్వహించారు. ఆయన మట్లాడుతూ వాతావరణం మార్పుల కారణంగా హిమ పాతాల పైఒత్తిడి ఏర్పడి అకాల వర్షాలు, వరదలకు కారణమవుతున్నాయని వెల్లడించారు.శాస్త్రవేత్త ప్రతిమ ప్రసంగిస్తూ శిలాజ ఇంధనాల వాడకం హిమపాతాలపై ప్రభావం చూపుతుందని వివరించారు.

సైబర్ వయొలెన్స్‌పై అవగాహన

తిరుపతి సిటీ : ఎస్పీడబ్ల్యూ కళాశాలలో శనివారం సైబర్ వయొలెన్స్ అండ్ డిజిటల్ ఎక్స్‌టెన్షన్ ఆఫ్ అబ్యూస్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ నారాయణమ్మ, సాయి సుజాత, లీల, రోజా రమణి, భువనేశ్వరి పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు ఒప్పందం



ఒప్పంద పత్రాలతో ప్రిన్సిపల్

తిరుపతి సిటీ : విద్యార్థుల ఇంటర్న్‌షిప్ కోసం జగతినెట్ వర్క్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో ఎస్పీడబ్ల్యూ కళాశాల శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రిన్సిపాల్ నారాయణమ్మ, సంస్థ డైరెక్టర్ వాసుదేవనాయుడు పాల్గొన్నారు .

ముగిసిన సంకీర్తనోత్సవాలు

తిరుపతి కల్చరల్ : శ్రీత్యాగరాజ స్వామి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాజమండపంలో ఐదు రోజులపాటు నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సాకే అన్నపూర్ణ బృందం ప్రదర్శించిన గాత్ర కచేరీ అలరించింది. అనంతరం డాక్టర్ నిరంజన శ్రీనివాసన్ ఆపలించిన కీర్తలను ఆకట్టుకున్నాయి. వినయ్ శర్మా బృందం గాత్ర కచేరీ రంజింపజేసింది. కళాకారులను ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్ సుందరం, కంచి రఘురాం జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

బీజేపీ మండల కమిటీ నియామకం

తిరుపతి రూరల్ (రామచంద్రాపురం) : బీజేపీ మండల కమిటీని నియమించారు. శనివారం ఈ మేరకు అధ్యక్షుడిగా జనార్దన్ నాయుడు, ఉపాధ్యక్షులుగా చండీశ్వర్ రెడ్డి, గిరిజా రాణి, హరి ప్రసాద్, శివశంకర్ రెడ్డి, కుమార్, భాగ్యలక్ష్మి, జనరల్ సెక్రటరీలుగా ప్రసాద్, గోపీనాథ్, కార్యదర్శులుగా శివ, నాగరాజు, రాజశేఖర్, రమాదేవి, మౌనిక, కష్టమూర్తి, కోశాధికారిగా రామకృష్ణారెడ్డి, సభ్యులుగా రోసిరెడ్డి, మునిప్రసాద్, ఢిల్లీరెడ్డి, చిరంజీవి, తేజ నియమితులయ్యారు.

అనధికార హాకర్ల గుర్తింపు

తిరుమల : తిరుమలలో పోలీసులు శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 72 మంది అనధికార హాకర్లను గుర్తించారు. వన్ టౌన్ సీఐ విజయ్ కుమార్, టూ టౌన్ సీఐ శ్రీరాముడు మాట్లాడుతూ.. తిరుమలలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు తప్పవని హెచ్చరించారు. మత్తు పదార్థాలను తీసుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


సీపీఆర్‌తో ప్రాణ రక్షణ



అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్

తిరుపతి కల్చరల్ : సీపీఆర్‌పై అవగాహన పెంపొందించుకుంటే మరో ప్రాణం రక్షించవచ్చని బాలాజీ నర్సింగ్ కళాశాల చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్ తెలిపారు. జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెస్పిరేషన్)పై విద్యార్థులకు శనివారం సాయంతరం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జేసీ ఎస్.రత్నశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు సీపీఆర్ చేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో బి.మధుసూదన్‌రెడ్డి, గుణశేఖర్, ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ పాల్గొన్నారు.

తిరుచ్చిపై వెంకన్న విహారం



చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి నిత్యకైంకర్యాలు సమర్పించారు. దేవదేవేరులకు కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం బంగారు తిరుచ్చిపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు.